క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ఎస్సీ, బీసీ బాలికల వసతి, ఎస్సీ బాలుర వసతి గృహాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు పరిసర ప్రాంతల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. అలాగే వర్షాకాల సీజన్‌లో డెంగీ, టైఫాయిడ్, మలేరియా, చికెన్ ఫైలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, హాస్టల్ వార్డెన్స్ జయశీల, సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని తొలగించాలి



వర్ని: బోధన్ మండలం బిక్నెల్లి జీపీలో పని చేసే కార్మికులు బాలాజీ, యాదు మృతికి కారణమైన గ్రామపంచాయతీ కార్యదర్శిని తొలగించి, పోలీసు కేసు నమోదు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ డిమాండ్ చేశారు. శనివారం వర్ని మండల కేంద్రంలోని సత్యనారాయణపురం జీపీ ఎదుట గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నన్నేసాబ్, బుడ్డక్కల సాయిలు, కార్యదర్శి లింగం, కోశాధికారి రాజు, కార్మికులు మారయ్య, సాయవ్వ, గంగామణి, పోశెట్టి, గంగారాం పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన సదస్సు

బోధన్: మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు, అనారోగ్యం, ప్రమాదాల అంశాల పై ఈ నెల 15న పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సదస్సు నిర్వహించనున్నట్లు అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ తెలిపారు. శనివారం పట్టణ కేంద్రంలో సంఘం ప్రతినిధులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు, యువత సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు శ్రీరాం, శ్రీకాంత్, ఆకాశ్, నవీన్, నందకిశోర్ పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



బోధన్: డివిజన్ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తూ పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు వీరశైవ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు శనివారం పట్టణ కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూమయ్యప్ప, పుష్ప, శంకర్, వీరేందర్, శోభ, సంఘ ప్రతినిధులు కర్నె శంకర్, పురాణే అజయ్‌కుమార్, ఎంబెల్లి శంకర్, సుదీర్, ప్రకాశ్, వీరేశ్‌బాబు, బస్వంత్, సాయితేజ, సుభాష్, శివరతన్, రమేశ్, నితన్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలి



రుద్రూర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎ. విఠల్ గౌడ్ పిలుపునిచ్చారు. కోటగిరి మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 17న అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాయకులు నల్లగంగాధర్, రాజు, గోపి, బుడాల రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ న్యాయవాది అంత్యక్రియలు పూర్తి

మాక్లూర్: గుండెపోటుతో మృతి చెందిన న్యాయవాది కిరణ్‌కుమార్‌గౌడ్ అంత్యక్రియలు శనివారం ఆయన స్వగ్రామమైన కల్లెడి గ్రామంలో జరిగాయి. అంత్యక్రియల్లో అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా, నుడా చైర్మన్ కేశవేణు, జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ప్రముఖ న్యాయవాది అజార్ కిషన్ రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

తెగిన మాటుకాలువ.. నిండని పెద్దచెరువు

- వృథా అవుతున్న వరదనీరు
- శాపంగా మారిన వరద బీభత్సం
- ఆయకట్టుకు అందని సాగునీరు



చింతలూరు చెక్‌డ్యాం కింద భారీ వరద ఉధృతికి ధ్వంసమైన మాటుకాలువ గైడ్‌వాల్



అంతంతగానే పచ్చలనడ్కుడ పెద్దచెరువులో నీరు

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ పెద్దచెరువుకు వరదనీరు రావడానికి ఉన్న మాటు కాలువ తెగిపోయి చెరువు నిండని పరిస్థితి ఏర్పడింది. చెరువు నిండితే సుమారు 350 ఎకరాలకు ప్రత్యక్షంగా, మరో 300 ఎకరాలకు పరోక్షంగా సాగునీరు లభించేది. జక్రాన్‌పల్లి మండలం చింతలూరు వద్ద పెద్దవాగు ద్వారా నిర్మితమైన మాటుకాలువతో నడ్కుడ పెద్ద చెరువుకు వర్షాకాలంలో వరదనీరు సరఫరా అయ్యేది. గతంలో గ్రామస్తులు ప్రతి వర్షాకాలంలో ఇసుక బస్తాలు అడ్డుగా పెట్టి వరదనీటిని మాటుకాలవకు మళ్లించేవారు. గత ప్రభుత్వం శాశ్వత పరిష్కారంగా గైడ్‌వాల్ నిర్మాణం చేపట్టింది. అంతేగాక చింతలూరు చెక్‌డ్యాంకు తూము ఏర్పాటు చేయించింది. తూము షట్టర్ తెరిస్తే నేరుగా మాటుకాలువకు నీటి సరఫరా జరుగుతుంది. రెండేళ్ల క్రితం భారీ వరద ఉధృతికి గైడ్‌వాల్ కొంతమేర పడిపోయింది. గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం గైడ్‌వాల్‌ను తిరిగి నిర్మింపజేసింది. ఈ సారి వర్షాలు సమృద్ధిగా కురిస్తే వాగులో వచ్చే వరద నీరు మాటు కాలువ ద్వారా ప్రవహించి చెరువు నిండుతుందని ఆశించారు. కానీ గత నెలలో కురిసిన అతిభారీ వర్షాలకు పెద్దవాగుకు వచ్చిన వరద ఉధృతికి చెక్‌డ్యాం కట్ట మాటుకాలువ ఉన్న వైపు గండి పడింది. తూము ధ్వంసమైంది. మాటుకాలువ గైడ్‌వాల్ కొట్టుకుపోయింది. దీంతో మాటుకాలువ ద్వారా నీటి సరఫరా జరిగే పరిస్థితి లేదు.

ఈ చెరువుకు వర్షం ద్వారా వరద వచ్చే అవకాశం చాలా తక్కువ. మాటు కాలువ నిరంతరం ప్రవహిస్తే సుమారు ఇరవై రోజుల్లో నిండే అవకాశం ఉంటుంది. పెద్దచెరువు నిండిన తర్వాత కాలువ ద్వారా గ్రామంలో ఉన్న ఊరచెరువుకు నీటిని తరలించుకునే సౌకర్యముంది. ఊరచెరువులో ఎక్కువైన నీరు ఇక్కడి నుంచి ఉన్న మాటుకాలువ ద్వారా మోతె పెద్ద చెరువుకు వెళ్తుంది. వానాకాలం పంటలకు వర్షపునీరు సరిపోయినా, ఎండాకాలం పంటలకు చెరువు నీరు ఉపయోగపడుతుంది. మాటుకాలువ ద్వారా నీరు రావాలంటే చెక్‌డ్యాం కట్టను, తూమును తిరిగి నిర్మించాలి. వీటిని ప్రభుత్వం ఎప్పుడు నిర్మిస్తుందో, పెద్దచెరువుకు పూర్వపు మాదిరిగా మాటుకాలువ ద్వారా నీటి సరఫరా ఎప్పుడు జరుగుతుందోనని గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు.

మరమ్మతుకు ప్రతిపాదనలు పంపించాం

నడ్కుడ పెద్దచెరువు మాటుకాలువ మరమ్మతుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. చెక్‌డ్యాం కట్ట, దెబ్బతిన్న తూము, షట్టర్, గైడ్‌వాల్ ఎంత మేర పడిపోయింది అంచనా వేసి నివేదించాం. చెక్‌డ్యాంకు గండి పడినచోట చాల మేరకు పొలం కోతకు గురైంది. అక్కడ వీటన్నిటికీ మరమ్మతు చేయాల్సి ఉంటుంది.

– కన్నయ్య, ఇరిగేషన్ సూపర్‌వైజర్, వేల్పూర్

రైతులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్: రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని, రైతులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మోర్తాడ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. సకాలంలో యూరియా అందించే తెలివి లేకున్నారూ. లక్షన్నర కోట్లతో మూసినది రివర్స్ ఫ్రంట్ చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డాంభికాలు పలుకుతున్నారని దుయ్యబట్టారు. బాల్కొండ నియోజకవర్గంలో యూరియా కోసం రైతులు ఎంతో కష్టంను ఎదుర్కొంటున్నారని సుంకెట్‌లో చెప్పులు లైన్‌లో పెట్టి రాత్రింబవళ్లు కాపలా కాశారని తెలిపారు. యూరియా కొరత తీర్చకపోతే రైతులతో తాము కూడా కలిసి పోరాటం చేస్తామన్నారు. నాయకులు రాజాపూర్ణనందం, పాపాయి పవన్, భోగ ఆనంద్, ఏనుగు రాజేశ్వర్, యూసుఫ్, దడివె నవీన్, చిన్నారెడ్డి, దోస్‌పాల్ దేవన్న, ఒల్లెం దేవదాస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాల్కొండ: చదువు మధ్యలో మానేసిన వారు ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీ విద్యను అభ్యసించాలని ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ సాయన్న శనివారం సూచించారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ నెల 17 వరకు ఫీజు చెల్లించి సభ్యులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే

మోర్తాడ్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అన్నారు. ప్రతి విద్యార్థిని ఎంతో గొప్పవానిగా తీర్చి దిద్దడానికి ఉపాధ్యాయులు తమ జీవితాన్ని త్యాగం చేస్తున్నారని ఆయన కొనియాడారు. మోర్తాడ్‌లో శనివారం బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆర్మూర్ డివిజన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు నంబుల గిరి అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డివిజన్‌లోని 46 పాఠశాలల నుంచి ఎంపిక చేసిన 90 మంది ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మల్లారెడ్డి, షఫీ, రవీందర్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ సమాజాన్ని జాగృతం చేయాలి





మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ ఇందూరు విభాగ్ ప్రచారక్ నర్రా వెంకట శివకుమార్, పాల్గొన్న ప్రజలు

- ఆర్ఎస్ఎస్ ఇందూరు విభాగ్ ప్రచారక్ నర్రా వెంకట శివకుమార్

సుభాష్‌నగర్: హిందూ సమాజాన్ని జాగృతం చేయాలని ఆర్ఎస్ఎస్ ఇందూరు విభాగ్ ప్రచారక్ నర్రా వెంకట శివకుమార్ అన్నారు. ఆదర్శ హిందూ కుటుంబంగా మన కుటుంబాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇస్కాన్ కంఠేశ్వర్ కేంద్రం ఆధ్వర్యంలో మాక్లూర్ మండలంలోని చిన్నాపూర్‌లో ఉన్న అర్బన్ పార్క్‌లో ఇస్కాన్ కుటుంబ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకట శివకుమార్ మాట్లాడుతూ.. ప్రపంచానికి జ్ఞాన భిక్ష పెట్టిన దేశం భారతదేశమని, మానవ సంబంధాల విలువను ప్రపంచానికి చాటిచెప్పిన సంస్కృతి మన హిందూ సంస్కృతి అని అన్నారు. అలాంటి సంస్కృతీని భారతీయులు మర్చిపోయి విదేశీ సంస్కృతి మోజు లో కొట్టుమిట్టాడుతున్న సమయంలో ఇస్కాన్ తనదైన శైలిలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు హిందూ సంస్కృతి మాధుర్యాన్ని తెలియజేస్తుందన్నారు. విదేశాల్లో సైతం ఇస్కాన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలతో కోట్లాది మంది హిందూ ధర్మాన్ని స్వీకరిస్తున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రారంభించి వందేళ్లు పూర్తవుతున్న శుభసందర్భంగా ఈ విజయదశమి నుంచి మొదలుపెట్టి 2026 విజయదశమి వరకు హిందూ సమాజాన్ని జాగృతం చేసే వివిధ కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు. ఏడాది నిర్వహించే కార్యక్రమాల్లో అన్ని వయస్సుల వారు కుటుంబ సమేతంగా పాల్గొని హిందూ సమాజం జాగృతి శక్తిని ప్రపంచానికి చాటి చెప్పాల్సిన అవసరముందన్నారు. మన ధర్మాన్ని మనం తెలుసుకోనంత కాలం చీకట్లోనే ఉండిపోతామని అన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ కంఠేశ్వర్ అధ్యక్షుడు రామానందరాయ్ ప్రభుదాస్, బీజేపీ నాయకులు మాదాసు స్వామియాదవ్, రమణ గోపెస్ ప్రభు, సీతాయచంద్ ప్రభు, బలరాం ప్రభు, ప్రాణప్రియ ప్రభు, సర్వనాథ ప్రభు, రాధా రాజా గోపిక ప్రభు, సునీల్ ప్రభు జీ, గంగారాం ప్రభు, రోహిత్ ప్రభు, సుగోపి మాలతీ దేవి, సత్య వ్రత దేవి, సనాతన గోపేశ్వరి, మా సుందరీ దేవి తదితరులు పాల్గొన్నారు.

ఆఖిరి మజిలీకి కష్టాలు

- సరైన దారి లేక అవస్థలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



బురదమయంగా మారిన రాజారాంనగర్‌లోని శ్మశాన వాటికకు వెళ్లే దారి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో ఉన్న రాజారాంనగర్, హౌసింగ్‌బోర్డు కాలనీల్లో ఉన్న శ్మశాన వాటికలకు వెళ్లేందుకు సరైన రహదారులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఈ రహదారులు పూర్తిగా నీటితో నిండి ఉండడంతో పాటు బురదమయంగా మారడంతో శ్మశాన వాటికకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. స్థానికులు ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు అవస్థలు తప్పవు. దీంతో చివరి మజిలీకి సైతం కష్టాలు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. రాజారాంనగర్ శ్మశానానికి వెళ్లే మార్గంలో వర్షపు నీరు చేరి దారి పూర్తిగా మూసుకుపోవడంతో ప్రజలు చెట్ల కొమ్మలపై కాలు పెడుతూ ముందుకు సాగాల్సిన పరిస్థితి నెలకొంది. బంధువులు చనిపోయిన బాధ ఒకవైపు, రహదారి సమస్య మరోవైపు ఉందంటు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆర్మూర్ శ్మశాన వాటిక సైతం పిచ్చిమొక్కలతో పూర్తిగా నిండిపోయాయి. దీంతో పాటు సరైన నీటి సౌకర్యం లేకపోవడంతో మున్సిపల్ ట్యాంకర్ల మీద ఆధారపడాల్సి వస్తోంది. శ్మశాన వాటికలో మరుగుదొడ్లు, స్నానపు గదులు, నిర్మాణాలు చేపట్టారు. కాని నీటి, విద్యుత్ సరఫరా కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

రాజారాంనగర్‌లోని వైకుంఠధామంలో కనీస వసతులు లేవు. అధికారులు శ్మశాన వాటికల్లో నెలకొన్న సమస్యలపై కన్నెత్తి చూడడం లేదు. ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు కష్టమవుతోంది. అధికారులు స్పందించాలి.

– భరత్, స్థానికుడు, రాజారాంనగర్

వసతులు కల్పించాలి

వైకుంఠధామంలో కావాల్సిన మౌలిక సదుపాయాలు లేవు. దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వైకుంఠధామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. వైకుంఠధామాల్లో వసతులు కల్పించాలి.

– శ్వేత, స్థానికురాలు, ఆర్మూర్

సార్వజనిక్ గణేశ్ మండలి వజ్రోత్సవాల పూర్ణాహుతి



రుద్రూర్ సార్వజనిక్ గణేశ్ మండలి నూతన కమిటీ సభ్యులు

రుద్రూర్: మండల కేంద్రంలోని సార్వజనిక్ గణేశ్ మండలి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవాలను వైభవంగా నిర్వహించారు. శనివారం వజ్రోత్సవాల పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వజ్రోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఆదాయ, వ్యయాలను గూర్చి కమిటీ అధ్యక్షుడు చిదుర వీరేశం వివరించారు. విరాళాలు, వినాయక విగ్రహ దాతలు, లాటరీ ద్వారా రూ. 29 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఉత్సవాల్లో ప్రతి రోజు దాతలు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారని అన్నారు. వజ్రోత్సవాలను విజయవంతం చేయడంలో కృషిచేసిన కమిటీ సభ్యులు, గ్రామస్తులు, అధికారులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. దాతలను, కమిటీ సభ్యులను, గ్రామ పెద్దలను ఘనంగా సన్మానించారు. వజ్రోత్సవాల సందర్భంగా మహిళలకు, పిల్లలకు ఏర్పాటు చేసిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. 76వ వార్షికోత్సవానికి పాత కమిటీ కొనసాగాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



కమ్మర్‌పల్లి: బషీరాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను భీమ్‌గల్ సీడీపీవో స్వర్ణలత శనివారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందడం లేదని వచ్చిన ఫిర్యాదులపై గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల సమక్షంలో లబ్ధిదారులను విచారించారు. తమ పిల్లలకు పౌష్టికాహారంతో పాటు, ప్రీప్రైమరీ స్కూల్ విద్య సక్రమంగానే అందుతుందని లబ్ధిదారులు వివరించారు. టీహెచ్ఆర్ సరుకుల పంపిణీ, పాల ప్యాకెట్ల పంపిణీపై లబ్ధిదారులను అడుగగా ఇస్తున్నారని తెలిపారు. ఇందుకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేవని లబ్ధిదారులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఏసీడీపీవో జ్ఞానేశ్వరి, సూపర్‌వైజర్ గంగహంస, వీడీసీ అధ్యక్షుడు శివానంద్, నర్సయ్య, హరీశ్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ అమరవీరులకు నివాళులు



మోర్తాడ్: సకల జనుల సమ్మె దినోత్సవం సందర్భంగా ఏర్గట్ల మండల కేంద్రంలో శనివారం తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమకారుడు దయానంద్ ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రాలకు, స్థూపం చిత్రానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో శాంతియుతంగా ఎంతో మంది ఉద్యమకారులు కదం తొక్కారని దయానంద్ కొనియాడారు. కార్యక్రమంలో ఉద్యమకారులు రాజేందర్, మహేశ్, వంశీ, శ్రీనివాస్, పురుషోత్తం, మోహన్, అంజన్న, శ్రీను, నవీన్, మోతిన్, కాటిపల్లి చిన్న బాలయ్య, గన్నారపు దాసు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పోచారం.. మీ పార్టీ ఏదీ?



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రుద్రూర్: బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఏ పార్టీలో కొనసాగుతున్నారో నియోజకవర్గ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ కోటగిరి మండల నాయకులు డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమించి కారు గుర్తుకు ఓటేసి గెలిపిస్తే వారిని విస్మరించి సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అధికార కాంగ్రెస్‌కు అనుకూలంగా పని చేయడం లేదా అని ప్రశ్నించారు. అసెంబ్లీ స్పీకర్‌కు చెప్పినట్టు బీఆర్ఎస్‌లోనే ఉంటే ఆ పార్టీ కార్యకర్తలను దూరం చేస్తూ కాంగ్రెస్ నాయకులకు దగ్గరగా ఎందుకు ఉంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మోరె కిషన్, సమీర్, గంగాప్రసాద్, అరవింద్, నాజీర్, నవీన్, మహేశ్‌రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌తో బహుళ ప్రయోజనాలు



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి



బోధన్‌లో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్

ఆర్మూర్‌టౌన్: జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. పట్టణంలోని కోర్టుల ఆవరణలో మండల న్యాయసేవాధికార సంఘం చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌తో కేసులు త్వరగా పరిష్కారమవుతా యని అన్నారు. వీటితో న్యాయవ్యవస్థపై భారం తగ్గుతుందని, పౌరుల సమయం, ధనం ఆదా అవుతుందని అన్నారు. కక్షిదారుల సమస్యలను పరస్పర అంగీకారంతో న్యాయబద్ధంగా జరుగుతుందన్నారు. ఆర్మూర్ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో సివిల్, క్రిమినల్, ఇతర కేసులు కలిసి మొత్తం 2,739 కేసులు పరిష్కరమైయ్యాయి. కార్యక్రమంలో జూనియర్ సివిల్‌జడ్జి సరళరాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భవ్యశ్రీ, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్, న్యాయవాద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, ప్రధానకార్యదర్శి జెస్సు అనిల్, న్యాయవాదులు, పోలీస్‌సిబ్బంది, కోర్టు సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్‌లో..

బోధన్‌టౌన్: బోధన్ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,573 వివిధ కేసులు పరిష్కారం కాగా రూ. 1,15,70,921 ఆదాయం సమకూరిందని ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ అన్నారు. లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ సివిల్ న్యాయమూర్తి కాంచనరెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి పూజిత, అడిషనల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి శివసాయి, స్పెషల్ సెకండ్ క్లాస్ న్యాయమూర్తి శేష సాయి తల్పలు, మధుసింగ్, హన్మంత్‌రావ్, కల్యాణి పాల్గొన్నారు.

సంక్షిప్తం

నూతన కమిటీ ఎన్నిక



బోధన్‌టౌన్: బోధన్ పట్టణ ఫొటో స్టూడియో అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మురళి, ఉపాధ్యక్షుడిగా గణేశ్, సెక్రెటరిగా అనిల్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీలుగా శ్రీకాంత్, భాస్కర్, శ్యామ్, కోశాధికారిగా ఉమాకాంత్ ఎన్నికయ్యారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకట నారాయణ, నిజామాబాద్ జిల్లా ఫొటోగ్రాఫర్స్ ఇన్‌చార్జి ప్రెసిడెంట్ వేముల శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



బాల్కొండ: మండలంలోని బోదేపల్లికి చెందిన పెండెం వానిల్ కుమార్ గుండెపోటుతో మరణించడంతో బాధిత కుటుంబానికి బీజేపీ నాయకులు రూ. 10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సాయికిరణ్, నాయకులు సంపత్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

బోధన్‌టౌన్: విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాల్లో పాఠశాలలు నిర్వహిస్తున్న పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కమిటీ అధ్యక్షుడు అంకిత్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు కొనసాగుతుండడంతో ఏబీవీపీ నాయకులు పాఠశాలలను బంద్ చేయించారు. సెలవు రోజుల్లో సైతం పాఠశాలలను నడుపుతూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వంట షెడ్డు ప్రారంభం



బాల్కొండ: జలాల్‌పూర్ శివారులోని రంగనాథుని ఆలయం వద్ద వంట షెడ్డును ఆలయ కమిటీ సభ్యులు శనివారం ప్రారంభించారు. షెడ్డు నిర్మాణానికి సహకరించిన దాత గుండేటి గంగారాంను కమిటీ సభ్యులు సన్మానించారు. ఆలయ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్మూర్ సి. ప్రభాకర్ ACO : 9010585333
: 9849180084
: 9666958559
బాల్కొండ ప్రదీప్ : 7893150102
బోధన్ ఎ. శివ : 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899